



మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
శనివారం 22 ఆగస్టు 2026 పేజీలు : 4

# మున్సిపల్ సమరం..

## ఉమ్మడి గుంటూరులో టెన్షన్!

మున్సిపల్ ఎన్నికలకు తెరలేవబోతోంది. రాష్ట్రంలోని 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో రాజకీయ వేడి మొదలైంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని పట్టణ స్థానిక సంస్థల్లో వార్డుల వారీ ఓటర్ల జాబితాల ప్రక్రియ వేగం పుంజుకుంది. సెప్టెంబర్ 3 నాటికి మున్సిపల్ ఓటర్ల జాబితాలు సిద్ధం చేయాలని ఎస్ఈసీ నిర్దేశించింది. అక్టోబరులో ఎన్నికలు నిర్వహించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అయితే పోలింగ్ తేదీలు, నామినేషన్ల షెడ్యూల్‌తో కూడిన తుది ఎన్నికల నోటిఫికేషన్ మాత్రం ఇంకా వెలువడలేదు.

- ఎన్నికలకు రంగం సిద్ధం..
- ఎస్ఈసీ కసరత్తు షురూ
- పొన్నూరు విలీన పంచాయతీలపై ఇంకా ఉత్కంఠ
- బాపట్లలో స్పష్టత.. వార్డుల లెక్కలపై ఆసక్తి
- కూటమిలో జనసేనకు ఏ మున్సిపాలిటీ?
- రిజర్వేషన్లు, విలీన గ్రామాలే కీలకం

వివరాలు 2లో..



10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/22/2026 3:28 AM Page 2



# మున్సిపల్ సమరం..

# ఉమ్మడి గుంటూరులో టెన్షన్!

మొదటి పేజీ తరువాయి

**ఎడిటర్ నరేంద్ర...**ఈసారి మున్సిపల్ పోరు ఉమ్మడి గుంటూరు జిల్లాలో కేవలం అధికార--ప్రతిపక్ష పార్టీల మధ్య పోటీగా కనిపించడం లేదు. అధికార కూటమిలోనే రాజకీయ సమీకరణాలు ఆసక్తి రేపుతున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి స్థానిక ఎన్నికలను ఎదుర్కొంటే.. ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేయాలి? ఏ మున్సిపాలిటీ బాధ్యత ఏ పార్టీకి ఇవ్వాలి? ఏ వార్డుల్లో ఎవరికి అవకాశం కల్పించాలి? అన్నది కీలకంగా మారనుంది. ముఖ్యంగా జనసేన ఈసారి 2024 అసెంబ్లీ ఎన్నికల సీట్ల సర్దుబాటు ఫార్ములాను స్థానిక సంస్థలకు యథాతథంగా వర్తింపజేయబోమని ఇప్పటికే స్పష్టం చేసింది. పార్టీ బలం, స్థానిక సంస్థాగత నిర్మాణం ఆధారంగా వాటా కోరుతోంది.

**నోటిఫికేషన్ కాదు.. కసరత్తు నోటిఫికేషన్!...**మున్సిపల్ ఎన్నికలపై గందరగోళానికి ప్రధాన కారణం ఇదే. ఆగస్టు 12న ఎస్ఈసీ జారీ చేసిన 401/రాజుజ-ఖీ1/2026-1 నోటిఫికేషన్ ద్వారా పట్టణ స్థానిక సంస్థల్లో ఫొటో ఓటర్ల జాబితాల తయారీ, ప్రచురణకు షెడ్యూల్ ఇచ్చింది. సెప్టెంబర్ 3 నాటికి వార్డువారీ ఓటర్ల జాబితాలు ప్రచురించాల్సి ఉంది. ఇది ఎన్నికల నిర్వహణకు ముందస్తు ప్రక్రియ మాత్రమే.రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మొత్తం 100లో 87 పట్టణ స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు ఇప్పటికే ముగిసింది. మరో 13 సంస్థల పదవీకాలం నవంబర్‌లో పూర్తికానుంది. కోర్టు కేసులు తదితర కారణాలతో 23 పట్టణ స్థానిక సంస్థలను ప్రస్తుత ప్రక్రియలో పక్కనపెట్టినట్లు తాజా సమాచారం. బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్ అమలు చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

**పొన్నూరు.. పంచాయతీలపై పంచాయతీ!...**ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రస్తుతం అత్యంత ఆసక్తిని రేపుతున్న అంశం పొన్నూరు. గతంలోనే పొన్నూరు మున్సిపాలిటీ పరిధిని విస్తరించేందుకు ఆరు గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చింతలపూడి, పెదఇటికంపాడు, వడ్డెముక్కల, కట్టెంపూడి, ఆలూరు, కసుకర్రు గ్రామ పంచాయతీలను పొన్నూరు మున్సిపాలిటీలో విలీనం చేయాలని 2020లో ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి గెజిట్ ప్రక్రియ కూడా జరిగింది.అయితే ఇప్పుడు ఎన్నికల ప్రక్రియలో ఆ విలీన గ్రామాల స్థితి, వార్డుల రూపకల్పన, ఓటర్ల జాబితా, స్థానిక సంస్థ పరిధి వంటి అంశాలపై మళ్లీ చర్చ మొదలైంది. ఏ గ్రామం ఏ వార్డులోకి వస్తుంది? విలీన ప్రాంతాలకు రాజకీయ ప్రాతినిధ్యం ఎలా ఉంటుంది? పాత పంచాయతీ రాజకీయాల్లో బలంగా ఉన్న నాయకులకు మున్సిపల్ రాజకీయాల్లో ఏ స్థానం దక్కుతుంది? అన్న ప్రశ్నలు ముందుకొస్తున్నాయి.అందుకే పొన్నూరు విషయంలో ఎన్నికల కంటే ముందు విలీన గ్రామాల వ్యవహారంపై పూర్తి స్పష్టత రావడం కీలకం. ఈ అంశం తేలకపోతే వార్డుల విభజన, రిజర్వేషన్లు, అభ్యర్థుల ఎంపిక వరకు ప్రభావం పడే అవకాశం ఉంది.

**బాపట్ల.. విలీన గ్రామాలపై స్పష్టత...**బాపట్ల విషయంలో పరిస్థితి కొంత భిన్నంగా కనిపిస్తోంది. గతంలో మున్సిపాలిటీ విస్తరణకు సంబంధించి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బాపట్ల చుట్టుపక్కల గ్రామాలను పట్టణ పరిధిలోకి తీసుకురావాలన్న ప్రతిపాదనలు, విలీన ప్రక్రియలు ఇప్పటికే చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో ప్రధాన చర్చ విలీనం జరుగుతుందా లేదా అన్నదానికంటే.. ఆ పరిధి ఆధారంగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్లు, ఓటర్ల జాబితా, అభ్యర్థుల ఎంపిక ఎలా ఉంటుందన్నదానిపైనే ఉంది.బాపట్ల జిల్లా అధికారిక పోర్టల్ కూడా ప్రస్తుత జిల్లా నిర్మాణం 2022లో ఏర్పడిందని స్పష్టం చేస్తోంది. పాత ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 12 మండలాలు, పాత ప్రకాశం జిల్లా నుంచి 13 మండలాలు బాపట్ల జిల్లాలోకి వచ్చాయి. దీంతో గత రాజకీయ లెక్కలతో పోలిస్తే ప్రస్తుత జిల్లా రాజకీయ భౌగోళికత పూర్తిగా మారింది.

**గుంటూరు.. విలీనాల ప్రభావం...**గుంటూరు నగరపాలక సంస్థలోనూ గతంలో గ్రామాల విలీనంతో వార్డుల సంఖ్య, పట్టణ పరిధి విస్తరించింది. అధికారిక జిల్లా వెబ్‌సైట్ ప్రకారం గుంటూరు కార్పొరేషన్‌లో ప్రస్తుతం 57 రాజకీయ వార్డులు ఉన్నాయి. నగర పరిధిని విస్తరించేందుకు చుట్టుపక్కల పది గ్రామాలను విలీనం చేసినట్లు జిల్లా పరిపాలన పేర్కొంటోంది.ఇక్కడ ఇప్పటికే కార్పొరేషన్ స్థాయి రాజకీయ సమీకరణాలు బలంగా ఉన్నాయి. అయితే కొత్త ఎన్నికల్లో రిజర్వేషన్ల మార్పులు, ఓటర్ల జాబితా, స్థానిక నాయకుల సామర్థ్యం కీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా కూటమి పార్టీల మధ్య వార్డుల సర్దుబాటు ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారనుంది.

**మంగళగిరి--తాడేపల్లి.. రెండు ప్రాంతాలు.. ఒకే కార్పొరేషన్...**మంగళగిరి--తాడేపల్లి ప్రాంతం కూడా ఉమ్మడి గుంటూరు రాజకీయాల్లో ప్రత్యేకమైనదే. గతంలో రెండు వేర్వేరు మున్సిపాలిటీలుగా ఉన్న ప్రాంతం కార్పొరేషన్‌గా మారిన తర్వాత రాజకీయ లెక్కలు మారాయి. పట్టణ ఓటర్లతో పాటు పరిసర గ్రామాల ప్రభావం కూడా ఇక్కడ గణనీయంగా ఉంటుంది.అమరావతి రాజధాని ప్రాంతంతో ముడిపడి ఉన్న రాజకీయ, ఆర్థిక అంశాలు ఈ కార్పొరేషన్ ఎన్నికలను మరింత ప్రాధాన్యంగా మార్చనున్నాయి. అధికార కూటమి పార్టీల మధ్య సమన్వయం ఎంతవరకు ఉంటుందన్నది కూడా ఫలితాలపై ప్రభావం చూపే అంశంగా మారనుంది.

**పల్నాడులో ఎవరి పట్టు?...**పల్నాడు జిల్లాలో నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, మాచర్ల, వినుకొండ, పిడుగురాళ్ల వంటి పట్టణాలు కీలకం. ఇక్కడ మున్సిపల్ ఎన్నికలు అంటే స్థానిక నాయకత్వానికి పరీక్ష. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉన్న రాజకీయ సమీకరణాలు మున్సిపల్ ఎన్నికల్లో యథాతథంగా పనిచేస్తాయా అన్నది ఆసక్తికరం.

పట్టణాల్లో కౌన్సిలర్ అభ్యర్థుల వ్యక్తిగత బలం, సామాజిక సమీకరణాలు, స్థానిక సమస్యలు, అభివృద్ధి అంశాలు ఫలితాలను ప్రభావితం చేయనున్నాయి. బీసీ రిజర్వేషన్ అమలుతో అనేక వార్డుల్లో అభ్యర్థుల లెక్కలు మారే అవకాశం ఉంది.

**జనసేనకు ఏ మున్సిపాలిటీ?...**ఇదే ఇప్పుడు కూటమి రాజకీయాల్లో అసలు చర్చ. జనసేన స్థానిక సంస్థల ఎన్నికల్లో 2024 సీట్ల సర్దుబాటు ఫార్ములాను అనుసరించబోమని స్పష్టం చేసింది. పార్టీ విస్తరణ, గ్రామస్థాయి నిర్మాణం, స్థానికంగా ఉన్న బలం ఆధారంగా సీట్ల వాటా ఉండాలని కోరుతోంది.ఉమ్మడి గుంటూరు జిల్లాలో జనసేనకు ఏ మున్సిపాలిటీ కేటాయిస్తారన్నది పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ రేపుతోంది. ఒక మున్సిపాలిటీని పూర్తిగా పార్టీకి అప్పగిస్తారా? లేక కౌన్సిలర్ వార్డుల స్థాయిలోనే సర్దుబాటు చేస్తారా? టీడీపీకి బలమైన పట్టణాల్లో జనసేనకు ఎంత మేర అవకాశం వస్తుంది? అన్నది ఇంకా తేలాల్సి ఉంది.ఇది కేవలం సీటు కేటాయింపు సమస్య కాదు. రాబోయే స్థానిక రాజకీయాల్లో మూడు పార్టీల మధ్య శక్తిసామర్థ్యాలను నిర్ణయించే అంశం కూడా. అందుకే జనసేనకు దక్కే మున్సిపాలిటీపై ఇప్పటి నుంచే ఆశావహుల్లో పోటీ మొదలైంది.

**సెప్టెంబర్ 3 తర్వాత అసలు లెక్కలు...**ఇప్పటి వరకు సాగుతున్న ప్రక్రియలో ఓటర్ల జాబితా కీలకం. 2025 నాటి ఓటర్ల జాబితాల ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఎస్ఈసీ నిర్ణయించింది. అక్టోబర్ 3న విడుదలయ్యే ఎస్ఐఆర్ తుది జాబితా కోసం వేచి ఉంటే ఎన్నికల ప్రక్రియ ఆలస్యం అవుతుందన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.అందుకే సెప్టెంబర్ 3న వార్డువారీ ఫొటో ఓటర్ల జాబితాలు వెలువడిన తర్వాతే అనేక రాజకీయ లెక్కలు స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఏ వార్డులో ఎంత ఓటరు బలం? విలీన గ్రామాల ప్రభావం ఎంత? రిజర్వేషన్ ఎక్కడికి వస్తుంది? ఎవరికి అవకాశం ఉంటుంది? అన్నదానిపై అప్పుడే పార్టీల్లో స్పష్టత పెరుగుతుంది.

**ఇక వార్డు వార్డుకూ వేడి!...**మొత్తానికి ఉమ్మడి గుంటూరు జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు మరోసారి రాజకీయ వేదికను వేడెక్కించనున్నాయి. పొన్నూరులో విలీన గ్రామాలపై ఉత్కంఠ.. బాపట్లలో కొత్త పరిధి లెక్కలు.. గుంటూరులో వార్డు సమీకరణాలు.. పల్నాడులో స్థానిక ఆధిపత్య పోరు.. మంగళగిరి--తాడేపల్లిలో కూటమి బలం.. అన్నింటికంటే జనసేనకు దక్కే వాటాపై ఆసక్తి.ప్రభుత్వం ఎన్నికలకు మార్గం సుగమం చేసింది. ఎస్ఈసీ ఓటర్ల జాబితాల ప్రక్రియను ముందుకు తీసుకెళ్తోంది. సెప్టెంబర్ 3 కీలక మైలురాయిగా మారనుంది. ఆ తర్వాత రిజర్వేషన్లు, వార్డుల లెక్కలు తేలితే రాజకీయ పార్టీల అసలు కసరత్తు మొదలవుతుంది.

**ఎవరి మున్సిపాలిటీ? ఎవరి వార్డు? ఎవరి అభ్యర్థి?..**ఇక నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రతి పట్టణం.. ప్రతి వార్డు.. ప్రతి విలీన గ్రామం రాజకీయ చర్చకు కేంద్రంగా మారనుంది.

# బాపట్లలో ఉచిత హోమియో వైద్య శిబిరం

## రెడ్‌క్రాస్ భవనంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ




**బాపట్ల, (రక్షణ న్యూస్):** బాపట్ల రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన శిబిరంలో ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్ర శేఖర్, జిల్లెలమూడి ప్రభుత్వ హోమియో వైద్యురాలు డాక్టర్ ఐనాపురపు భువనేశ్వరి రోగులను పరీక్షించారు. అనంతరం అవసర మైన వారికి ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక, తక్షణ వ్యాధులతో పాటు మొండి వ్యాధులకు ప్రభుత్వ హోమియో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. బాపట్ల పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ నారాయణ బట్టు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎడ్లపాడులో ఎస్ఐఆర్ ప్రత్యేక కార్యక్రమం

## బీఎల్ఓలు, బీఎల్ఏలు తప్పనిసరిగా హాజరు



**ఎడ్లపాడు, (రక్షణ న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు ఎడ్లపాడు మండలంలో ఈ నెల 22, 23 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యక్రమం చేపడుతున్నట్లు తహసీల్దార్ విజయశ్రీ తెలిపారు. మండలంలోని బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పూర్తి రికార్డులతో తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. రాజకీయ పార్టీల బీఎల్ఏలు కూడా పాల్గొనేలా బీఎల్ఓలు సమాచారం అందించి సమన్వయం చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు పరస్పర సహకారంతో పనిచేయాలని కోరారు.

# సత్తెనపల్లిలో ఓటర్లకు ప్రత్యేక ప్రచార దినాలు

## 22, 23, 29, 30 తేదీల్లో బీఎల్ఓలు అందుబాటులో



**సత్తెనపల్లి, (రక్షణ న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ––2026లో భాగంగా సత్తెనపల్లి నియోజకవర్గంలో ఈ నెల 22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించనున్నట్లు ఓటర్ల నమోదు అధికారి, ఆర్డీవో కె.గోపాలకృష్ణ తెలిపారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రచార దినాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటర్ల నమోదు, వివరాల్లో మార్పులు, చేర్పులు, అభ్యంతరాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తారని చెప్పారు. అర్హులైన పౌరులు ఓటర్ల జాబితాలో తమ పేర్లు, వివరాలను పరిశీలించుకుని అవసరమైన దరఖాస్తులను గడువులోగా సమర్పించాలని కోరారు.

# పేటలో పీఎన్‌బీ నూతన శాఖ ప్రారంభం

## విజయవాడ సర్కిల్‌లో బ్రాంచ్‌ల సంఖ్య 82కు చేరిక



**చిలకలూరిపేట, (రక్షణ న్యూస్):** పట్టణంలోని కళామందిర్ సెంటర్ గౌరీశంకర్ టవర్స్‌లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ నూతన శాఖ శుక్రవారం ప్రారంభమైంది. విజయవాడ సర్కిల్ డీజీఎం, సర్కిల్ హెడ్ కవితా ఫ్రాంక్ ముఖ్య అతిథిగా హాజరై శాఖను ప్రారంభించారు. ప్రజలు, రైతులు, వ్యాపారుల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన బ్యాంకింగ్ సేవలు అందిస్తామని ఆమె తెలిపారు. నూతన శాఖతో విజయవాడ సర్కిల్ పరిధిలో పీఎన్‌బీ శాఖల సంఖ్య 82కు చేరిందన్నారు. స్థానికులు బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ హెడ్ పి.నారయ్య కోరారు. కార్యక్రమంలో ఏజీఎంలు రామనాథన్, సతీష్, యూనియన్ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నోటీసులపై విచారణ




బాపట్ల రక్షణ న్యూస్

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా బాపట్ల మండలం పూండ్ల గ్రామంలో ఎస్ఐఆర్ నోటీసులపై విచారణ శుక్రవారం కొనసాగింది. గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 5 పరిధిలో లాజికల్ డిస్క్రెపెన్సీలు, మ్యాపింగ్ లేని కేసులకు సంబంధించి నోటీసులు అందుకున్న 133 మంది వివరాలను అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ సలీమా ఆధ్వర్యంలో జరిగిన విచారణకు నోటీసులు అందుకున్న పలువురు హాజరై తమకు సంబంధించిన వివరాలు, ఆధారాలను సమర్పించారు. సమర్పించిన పత్రాలను ఓటర్ల జాబితాలోని వివరాలు, అందుబాటులో ఉన్న రికార్డులతో అధికారులు సరిపోల్చి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సలీమా కేసుల వారీగా వివరాలను పరిశీలిస్తూ, అవసరమైన ఆధారాలను స్వీకరించారు. ఓటర్ల జాబితాలో అర్హత కలిగిన వారి పేర్లు ఉండేలా, వివరాల్లో ఉన్న లోపాలను నిబంధనల ప్రకారం సరిచేసే చర్యల్లో భాగంగానే విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పూండ్ల పోలింగ్ స్టేషన్ పరిధిలోని 133 కేసులను ఆధారాల మేరకు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ఈ విచారణ నిర్వహిస్తున్నారు.

# అతిథి గృహాల్లో పోలీసుల తనిఖీలు

కర్లపాలెం రక్షణ న్యూస్



బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు కర్లపాలెం మండలంలోని హోటళ్లు, లాడ్జీలు, అతిథి గృహాల్లో ఎస్ఐ ఎస్. రవీంద్ర ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా చేపట్టిన ఈ తనిఖీల్లో ఆయా గృహాల్లో బస చేస్తున్న వారి వివరాలు, రిజిస్టర్లను పరిశీలించారు. అతిథి గృహాల నిర్వాహకులు సందర్శకుల పూర్తి వివరాలను నమోదు చేయడంతో పాటు వారి గుర్తింపు కార్డుల వివరాలను తప్పనిసరిగా రికార్డులో ఉంచాలని ఎస్ఐ సూచించారు. భద్రతా చర్యల్లో భాగంగా సీసీటీవీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని స్పష్టం చేశారు. హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లలో అనుమానాస్పద వ్యక్తుల సంచారం లేదా అసాంఘిక కార్యకలాపాలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే కార్యకలాపాలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మండలంలో ఇలాంటి ఆకస్మిక తనిఖీలు తరచుగా కొనసాగుతాయని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

# పేటలో అత్యాధునిక ఫెర్టిలిటీ, మెటర్నిటీ ఆసుపత్రి

## అందుబాటు ధరల్లో ఐవీఎఫ్ చికిత్సలు

**చిలకలూరిపేట, (రక్షణ న్యూస్):** సంతానలేమితో బాధపడుతున్న దంపతులకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తూ చిలకలూరిపేటలో 'వరలక్ష్మీ ఫెర్టిలిటీ అండ్ మెటర్నిటీ హాస్పిటల్', టెస్ట్యూబ్ బేబీ సెంటర్ ప్రారంభమయ్యాయి. డాక్టర్ గరికపాటి వరలక్ష్మి సారథ్యంలో ఏర్పాటైన ఈ కేంద్రంలో ఐవీఎఫ్ తదితర సంతాన సాఫల్య చికిత్సలను స్థానికంగానే అందిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది. అత్యాధునిక పరికరాలు, నిపుణులైన వైద్య బృందంతో సేవలు అందిస్తున్నట్లు పేర్కొంది. ప్రసూతి వైద్యంలోనూ ప్రత్యేక సేవలు అందిస్తున్నామని తెలిపింది. ఎన్ఆర్‌టీ సెంటర్, భగవాన్ టవర్స్‌లో ఈ కేంద్రం ఉందని పేర్కొంది.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/22/2026 3:28 AM Page 4



# పేటలో బీహెచ్ఎఫ్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా

## 400 మందికి ఉద్యోగ ఆఫర్ లెటర్లు



**చిలకలూరిపేట, (రక్షణ న్యూస్):** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో బీహెచ్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. సుమారు 80 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ సంస్థలకు చెందిన హెచ్ఆర్ ప్రతినిధులను నిర్వాహకులు సన్మానించారు. ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబరిచిన 400 మంది అర్హులకు అతిథుల చేతుల మీదుగా ఉద్యోగ ఆఫర్ లెటర్లు అందజేశారు. నిరుద్యోగ యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు భవిష్యత్తులోనూ జాబ్‌మేళాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని బీహెచ్ఎఫ్ ప్రతినిధులు తెలిపారు.

# రేపు ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

## ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులకు అవకాశం



**పల్నాడు, (రక్షణ న్యూస్):** ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. నాలుగో శనివారం ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. ఆయా వర్గాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని ఆమె సూచించారు. ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# వృద్ధులకు అన్నదానం



**గురజాల రక్షణ న్యూస్**

గురజాల మండలంలోని గంగవరం గ్రామంలో ఉన్న అక్షయ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో గురజాల మండల తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు సతీష్ ఏచూరి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వృద్ధులకు పండ్లు, మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జానకిరామ్ గూడూరి, మాచర్ల నాగేశ్వరరావు, బొజ్జ గణేష్, పయ్యావుల బాబు పాల్గొన్నారు. ఆశ్రమ నిర్వాహకురాలు గుండాల మల్లేశ్వరి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# సైనిక్ కార్యాలయానికి శ్రీకారం

**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఈ నెల 27న జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయం ప్రారంభం కానుండటం సంతోషదాయకమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు అన్నారు. బాపట్లలో కార్యాలయం ఏర్పాటుకు సహకరించిన జిల్లా కలెక్టర్ వి. వినోద్‌కుమార్, రాష్ట్ర సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కెప్టెన్ సత్యప్రసాద్, ఉమ్మడి గుంటూరు జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి గుణశీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఏర్పాటుతో సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు మరింత చేరువ కానున్నాయని సాంబశివరావు పేర్కొన్నారు. సైనిక్ వెల్ఫేర్ శాఖలో సిబ్బందిని పెంచడంతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేయాలని గతంలో హోంమంత్రి వంగలపూడి అనితతో పాటు సంబంధిత అధికారులను కోరినట్లు తెలిపారు. నూతన కార్యాలయానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో మాజీ సైనికులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. సుంకర శేషగిరిరావు బీరువా, చలికొండ



వెంకట కృష్ణారావు రెండు ర్యాక్‌లు, హానరరీ కెప్టెన్ నిడమానూరు లక్ష్మీనారాయణ రెండు ఆఫీస్ టేబుళ్లు అందించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. సీనియర్ మాజీ సైనికులు షేక్ ఖలీల్ సైతం అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బాపట్లలో జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయం ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన గుణశీలకు మాజీ సైనికుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్ అధ్యక్షులు పుట్టా ఆదిశేషారెడ్డి, ఉపాధ్యక్షులు చలికొండ వెంకట కృష్ణారావు, సుంకర శేషగిరిరావు, ట్రెజరర్ షేక్ నిజా ముద్దీన్, సీనియర్ మాజీ సైనికులు దూళ్ల వెంకటేశ్వర్లు, రాయపూడి శ్రీనివాసరావు, పసుపులేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రేపల్లెలో విద్యుత్ అంతరాయం

**రేపల్లె రక్షణ న్యూస్**

రేపల్లె పట్టణంలో 33 కేవీ నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. రైల్వే స్టేషన్ నుంచి వినాయకుడి ఆలయం వరకు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా, తాలూకా కార్యాలయాలు, నెహ్రూ బొమ్మ సెంటర్, మున్సిపల్ కార్యాలయ రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి, పల్స్ ఆసుపత్రి నుంచి రాజ్యలక్ష్మి థియేటర్ వరకు పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. నూతన 33 కేవీ లైన్ ఏర్పాటులో భాగంగా ఈ అంతరాయం అనివార్యమని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు పనులకు సహకరించాలని అధికారులు కోరారు.

# అగ్నిప్రమాద బాధితులకు చేయూత

**బాపట్ల రక్షణ న్యూస్**



బాపట్ల రూరల్ పరిధిలోని కంకటపాలెం గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో ఇళ్లు కాలిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న రెండు కుటుంబాలకు కరుణ జీవన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇనకొల్లు పోలీసురావు చేయూతనందించారు. బాధిత కుటుంబాలకు దుస్తులు, నిత్యావసర సరుకులు, బియ్యం తదితర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పోలీసురావు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. స్నేహితుడు బొంత శామ్యూల్ త్యాగరాజు సహకారంతో ఈ సహాయ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన జుట్టూరి శ్రీనివాసరావు, ఓచూరి పిచ్చయ్య కుటుంబాలకు అవసరమైన సామగ్రిని అందించినట్లు పేర్కొన్నారు. బాపట్ల జిల్లాలో ఎక్కడ అగ్నిప్రమాదం జరిగినా శామ్యూల్ త్యాగరాజు తనవంతు సహకారం అందిస్తున్నారని, ఆయన సేవలు అభినందనీయమని పోలీసురావు పేర్కొన్నారు. బాధితులకు అండగా నిలవడం ద్వారా మానవత్వాన్ని చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరుణ జీవన్ మినిస్ట్రీస్ కోశాధికారి కనపర్తి రాజారావు, శ్రీనివాసరావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల గళం వినిపించాలి



**బాపట్ల రక్షణ న్యూస్**

కృష్ణా--గుంటూరు ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా ఎం. హనుమంతరావును బలపరచాలని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. బాపట్లలోని ఎంఎస్ఆర్ కళ్యాణ మండపంలో హనుమంతరావు పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. యూటీఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షులు జడ వినయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర యూటీఎఫ్ అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై అవగాహన కలిగి, వారి హక్కుల కోసం సమర్థవంతంగా పనిచేసే అభ్యర్థి హనుమంతరావు అని పేర్కొన్నారు. ఆయనకు ఉపాధ్యాయులంతా మద్దతుగా నిలవాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి, వాటి పరిష్కారానికి కృషి చేయగల సామర్థ్యం హనుమంతరావుకు ఉందన్నారు. ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడేందుకు ఆయనను గెలిపించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర యూటీఎఫ్ ప్రతినిధులు కే. శ్రీనివాసరావు, ప్రేమ్‌కుమార్, పాపారావు, జేవీవీ ప్రతినిధులు రామారావు, భాస్కరరావు, ప్రైవేట్ టీచర్స్ నాయకులు సూర్యారావు, ప్రజా సంఘాల ప్రతినిధులు బాబూరావు, గంగయ్య, జిల్లా కమిటీ బాధ్యులు అడుగుల శ్రీనివాసరావు, రవిబాబు, సుబ్రహ్మణ్యం, ఎం. వెంకటేశ్వరరెడ్డి, మద్దాల సురేష్, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు, మండల, పట్టణ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/22/2026 3:28 AM Page 5



# శాంతిభద్రతలపై సీఐ హరికృష్ణ కీలక సూచనలు

### చందోలు రక్షణ న్యూస్

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, నిర్భయంగా జరిగేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని బాపట్ల రూరల్ సర్కిల్ సీఐ బి. హరికృష్ణ సూచించారు. పిట్టలవానిపాలెం మండలం కొత్తపాలెం గ్రామంలో బాపట్ల రూరల్ పోలీసులు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలు సంయమనం పాటిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సీఐ హరికృష్ణ కోరారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అదేవిధంగా రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వాహనదారులు ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా ప్రమాదాలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ నేరగాళ్ల మోసాలకు ప్రజలు బలికాకుండా అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు. అనుమానాస్పద ఫోన్‌కాల్స్, లింకులు, సందేశాలకు స్పందించవద్దని, బ్యాంకు ఖాతాలు, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని వివరించారు. మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తూ వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసు సిబ్బంది వివరించారు. గ్రామంలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణకు, ప్రజల భద్రతకు మరింత సహకారం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో చందోలు ఎస్ఐ కె. మాధవరావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతి ఒక్కరూ నిర్భయంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ప్రజలు ఎలాంటి సమస్య ఎదురైనా పోలీసులను సంప్రదించాలని సూచించారు. పోలీసు సిబ్బంది, గ్రామస్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# అనసూయ వ్యాఖ్యలపై నిరసన




### బాపట్ల రక్షణ న్యూస్

'జై శ్రీరామ్' అంటూ నినదించే వారందరినీ దొంగలుగా అభివర్ణించిన సినీనటి, టీవీ యాంకర్ అనసూయ వ్యాఖ్యలను నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బాపట్ల పట్టణంలో ఆందోళన చేపట్టారు. బజరంగ్‌దళ్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు నాళం నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు అనసూయ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. మత విశ్వాసాలకు సంబంధించిన నినాదాలను అవమానించే విధంగా మాట్లాడటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. బాధ్యతాయుతమైన వ్యక్తులు ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా సంయమనం పాటించాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ట్రెజరర్ మద్దుల వెంకటేశ్వర్లు, హిందూ చైతన్య వేదిక కండ సంయోజక్ బెజవాడ వెంకటేశ్వర్లు, సాహస సంయోజక్ నాగేశ్వరరావు, భజరంగ్‌దళ్ జిల్లా నాయకుడు ఇమ్మడిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం.

## ప్రమాదంలో ఒకరు మృతి ఇద్దరికీ తీవ్రగాయాలు...



### రేపల్లె రక్షణ న్యూస్

బాపట్ల జిల్లా రేపల్లె పరిధిలోని జాతీయ రహదారి-216పై శుక్రవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారుమూరు వద్ద అదుపుతప్పిన కారు వంతెనను బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గుంటూరుకు చెందిన మాలంపాటి రవికుమార్ (62) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని రేపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.